క్లుప్తంగా

ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలి



మొక్కనాటుతున్న అదనపు కలెక్టర్ దీపక్ తివారి

ఆసిఫాబాద్: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని అదనపు కలెక్టర్ (స్థానికం) దీపక్ తివారి అన్నారు. వనమహోత్సవంలో భాగంగా మున్సిపాలిటీ ఆధ్వర్యంలో గురువారం అదనపు కలెక్టర్(రెవెన్యూ) దాసరి వేణుతో కలిసి జన్కాపూర్ రైతు వేదిక ఆవరణలో మొక్కలు నాటారు. జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

నిబద్ధతతో పని చేయాలి



మాట్లాడుతున్న ఆడే ప్రకాశ్

కెరమెరి: తమ విధుల పట్ల ఉపాధ్యాయులు నిబద్ధత పనిచేయాలని ఎంఎస్‌వో ఆడే ప్రకాశ్ అన్నారు. మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో హెచ్‌ఎంలకు గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు తక్కువగా ఉన్న చోట్ల వీరి సంఖ్య పెంచేలా కృషిచేయాలన్నారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలన్నారు. కాంప్లెక్స్ హెచ్‌ఎంలు చంద్రశేఖర్, భరత్ తదితరులు పాల్గొన్నారు.

మొక్కలతోనే మానవ మనుగడ



మొక్కలు నాటుతున్న విద్యార్థులు

కెరమెరి: మొక్కలతోనే మానవ మనుగడ అనిప్రధానోపాధ్యాయులు పేర్కొన్నారు. మండలంలోని ప్రాథమిక, ఉన్నత, ప్రాథమికోన్నత పాఠశాలల్లో మొక్కలు నాటారు. నాటిన మొక్కలకు ప్రతీరోజూ నీరందించాలన్నారు. తమతమ ఇళ్ల ఆవరణల్లో మొక్కలు నాటాలని కాంప్లెక్స్ హెచ్‌ఎంలు ఆడే ప్రకాశ్, చంద్రశేఖర్, భరత్ పేర్కొన్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన

తిర్యాణి: మండలంలోని చెలిమల, రొంపెల్లి, గిన్నెదరి, తిర్యాణి, పంగిడిమాదర గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థులకు సీజనల్ వ్యాధులపై వైద్యారోగ్యశాఖ సబ్ యూనిట్ అధికారి శ్రీనివాస్ గురువారం అవగాహన కల్పించారు. వ్యక్తిగత పరిశుభ్రతతోపాటు పరిసరాల శుభ్రతను పాటించాలన్నారు. అనంతరం వసతి గృహాల్లో దోమల మందు పిచికారీ చేయించారు. హెల్త్ అసిస్టెంట్ పరుశురాం తదితరులు ఉన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన

లింగాపూర్: మండలకేంద్రంలోని జెడ్పీ పాఠశాల విద్యార్థులతోపాటు యువకులకు గురువారం సైబర్ నేరాలపై గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్సై ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ సైబర్ నేరాలు, గంజాయి, డ్రగ్స్‌లకు అలవాటు పడకుండా బాగా చదవాలన్నారు. నూతన చట్టాలు, రోడ్డు ప్రమాదాలు, ట్రాఫిక్ నిబంధనలపై అవగాహ కల్పించారు. పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

విధుల నుంచి తొలగించాలి

లింగాపూర్: మండల కేంద్రంలోని తెలంగాణ గ్రామీణ బ్యాంక్‌లో తాత్కాలికంగా అటెండర్ ఆర్కి జ్యోతిరాంను విధుల నుంచి తొలగించాలని ఆదివాసీ సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. బ్యాంక్ రుణాలు ఇప్పిస్తానని ప్రజలకు మాయమాటలు చెప్పి డబ్బులు వసూళ్లకు పాల్పడుతున్నారని బ్యాంక్ మేనేజర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. మాదావి సీను, మెస్రం నగేశ్, రాజేష్, తిరుపతి, మాణిక్ రావుతోపాటు గ్రామస్తులు ఉన్నారు.

షీటీమ్ సేవలపై అవగాహన

జైనూర్: మహిళలు ఎవరైన హింసకు, ఈవ్‌టీజింగ్‌లకు గురైతే షీటీంను సంప్రదించాలని షీటీం హెడ్ కానిస్టేబుల్ సునీత అన్నారు. మండల కేంద్రంలో మహిళలకు గురువారం షీటీమ్ సేవలపై అవగాహన కల్పించారు. ఫేస్‌బుక్, వాట్సాప్, ఇన్‌స్టాగామ్‌ల వినియోగంలో చాలా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. షీటీం సభ్యులు రమాదేవి, శ్రీలత, స్వప్న, తదితరులు ఉన్నారు.

రుణమాఫీపై సంబురాలు



కెరమెరి: సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తూ..



కెరమెరిలో నిర్వహిస్తున్న ర్యాలీ



జైనూర్: సంబురాల్లో పాల్గొన్న ఆత్రం సుగుణ, తదితరులు



పెంచికల్‌పేట్: ఎల్కపల్లి వద్ద సంబరాల్లో రైతులు

కెరమెరి/పెంచికల్‌పేట్/తిర్యాణి/లింగాపూర్/దహెగాం/సిర్పూర్(టి)/కౌటాల/కాగజ్‌నగర్‌రూరల్/జైనూర్/రెబ్బెన: రాష్ట్ర ప్రభుత్వం తొలివిడతలో రైతులకు రూ.లక్ష లోపు రుణమాఫీ చేసిన సందర్భాన్ని పురస్కరించుకొని జిల్లావ్యాప్తంగా గురువారం సంబురాలు జరుపుకొన్నారు. రైతువేదికలు, ఇతరచోట్ల వద్ద ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చిత్రపటాలకు క్షీరాభిషేకం నిర్వహించారు. పలుచోట్ల ర్యాలీలు నిర్వహించారు. సీఎం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కార్యక్రమం నిర్వహించారు. అధికారులు, రైతులు వీక్షించారు. జైనూర్‌లో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఆదిలాబాద్ పార్లమెంట్ నాయకురాలు ఆత్రం సుగుణ మాట్లాడుతూ రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమన్నారు. ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.



తిర్యాణి: సీఎం చిత్రపటంతో ర్యాలీ



లింగాపూర్: వీసీలో పాల్గొన్న నాయకులు



దహెగాం: వీసీలో పాల్గొన్న అధికారులు, రైతులు



సిర్పూర్(టి): క్షీరాభిషేకం చేస్తూ..



కౌటాల: వీక్షిస్తున్న అధికారులు, రైతులు



రెబ్బెన: రైతు వేదిక సంబురాల్లో నాయకులు

అన్నిరంగాల్లో రాణించాలి

- ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు



విద్యార్థినులతో భోజనం చేస్తున్న ఎమ్మెల్యే

చింతలమానెపల్లి: విద్యార్థినులు అన్ని రంగాల్లో రాణించాలని ఎమ్మెల్యే హరీశ్‌బాబు అన్నారు. మండల కేంద్రంలోని కస్తూరిబా విద్యాలయాన్ని గురువారం సందర్శించారు. అక్కడి పరిసరాలను పరిశీలించారు. కేజీబీవీ సమస్యలపై ఫిర్యాదులు వచ్చిన నేపథ్యంలో ఆయన ఇక్కడికి వచ్చారు. పాఠశాల ఆవరణలో మొక్కను నాటారు. అనంతరం విద్యార్థినులు, సిబ్బంది సమస్యలను తెలుసుకున్నారు. పాఠశాలపకు వచ్చే దారి బురదగా మారిందని తెలిపారు. పాఠశాలకు ప్రహరీ, డ్రెయినేజీ వ్యవస్థ తదితర సమస్యలను ఎమ్మెల్యేకు విన్నవించారు. ఇంటర్ విద్యార్థులకు తరగతులు నిర్వహిస్తున్నామని, ఇందుకు భవనం మంజూరైనట్లు అధికారులు తెలియజేసినా నిర్మాణం ప్రారంభం కాలేదని ఎమ్మెల్యేకు తెలిపారు. సమస్యను ఉన్నతాధికారులకు దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. ఈసీజన్‌లో ప్రబలే వ్యాధులపై విద్యార్థినులు అప్రమత్తంగా ఉండాలన్నారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలన్నారు. పాఠశాలలో మహిళా వైద్యురాలితో వైద్య శిబిరం ఏర్పాటు చేయిస్తానన్నారు. మండల వ్యాప్తంగా గూడెం రోడ్డు, దిందా వంతెన పనులు అటవీ అనుమతులు లేక నిలిచిపోయాయని ప్రభుత్వం వద్ద నిధులు లేని కారణంగా కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించలేని పరిస్థితి ఉందన్నారు. అంతకుముందు ఎమ్మెల్యే విద్యార్థులు సిబ్బందితో కలిసి భోజనం చేశారు. ఆయన వెంట బీజేపీ జిల్లా కార్యదర్శి దోని శ్రీశైలం, మండల అధ్యక్షుడు తిరుపతి గౌడ్, నాయకులు మల్లయ్య, మనోహర్ గౌడ్, రమేశ్, ఎస్ఓ శ్రీదేవి ఉన్నారు.

అర్హులందరికీ రుణమాఫీ వర్తింపజేయాలి



మాట్లాడుతున్న సంజీవ్‌కుమార్, మహేశ్‌గౌడ్

రెబ్బెన: అర్హులందరికి రుణమాఫీ వర్తింపజేయాలని రెబ్బెన పీఏసీఎస్ చైర్మన్ కార్నాథం సంజీవ్‌కుమార్, వైస్ చైర్మన్ రంగు మహేశ్‌గౌడ్ అన్నారు. మండల కేంద్రంలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. రుణమాఫీ లెక్క తప్పిందని, రైతులకు ఇవ్వాల్సిన మొత్తం తగ్గిందనే అభిప్రాయం వ్యక్తం అవుతోందని అన్నారు. అర్హులందరికీ రుణమాఫీ చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. మాజీ వైస్ ఎంపీపీ సత్యనారాయణ, మాజీ సర్పంచ్ పోషమల్లు, మాజీ ఎంపీటీసీ పోతిరెడ్డి, బీఆర్ఎస్ నాయకులు మధునయ్య, రాజేశ్వర్‌రావు, సుధాకర్, సుబ్బారావు, ఉబేద్, అప్పు, మురళీ, వెంకటేశ్ పాల్గొన్నారు.

సెల్‌ఫోన్ అప్పగింత



సెల్‌ఫోన్ అప్పగిస్తున్న ఎస్సై మధుకర్

కౌటాల: పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ను బాధితుడికి ఎస్సై మధుకర్ అప్పగించారు. మండలంలోని కన్నెపల్లి గ్రామానికి చెందిన మొర్లె పోశన్న ఇటీవల తన రూ. 11 వేల విలువ గల సెల్‌ఫోన్‌ను పొగొట్టుకున్నాడు. సీఈఐఆర్ ద్వారా ఫిర్యాదు చేయగా ఫోన్ ట్రేస్ చేసి బాధితుడికి పోలీసుస్టేషన్‌లో గురువారం అప్పగించినట్లు ఎస్సై తెలిపారు. ఆయన వెంట పోలీసులున్నారు.

టీచర్ల సమస్యలు పరిష్కరిస్తాం



సభ్యత్వ నమోదులో ఆడే ప్రకాశ్, తదితరులు

కెరమెరి: ఉపాధ్యాయులు సమస్యల పరిష్కారానికి నిరంతర కృషి చేస్తామని పీఆర్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆడే ప్రకాశ్ అన్నారు. మండలంలోని గోయగాం, కెరమెరి ఉన్నత పాఠశాలల్లో గురువారం ఏర్పాటు చేసిన సభ్యత్వ నమోదులో పాల్గొని మాట్లాడారు. సమగ్ర శిక్షలో విధులు నిర్వహిస్తున్న కాంట్రాక్ట్ సిబ్బందికి టైం స్కేల్, ఉద్యోగ భద్రత కల్పించేందుకు సీఎంతో మాట్లాడతామన్నారు. మోడల్ స్కూల్, ట్రైబల్ వెల్ఫేర్ పాఠశాల సీఆర్టీల సమస్యలు పరిష్కరిస్తామన్నారు. మహిళలకు ద్యోగులకు మెటర్నిటి లీవ్ ఇప్పించేందుకు కృషి చేస్తామన్నారు. నాయకులు భరత్‌కుమార్, సోము, భాస్కర్, చంద్రశేఖర్, దివ్యశ్రీ, భరత్‌రావు, శివప్రసాద్, ప్రవీణ్, విష్ణు, శ్రీనివాస్ అర్చన, జైవంత్, సత్యనారాయణ, రవితేజ, రాజశ్రీ, స్వరూప తదితరులు ఉన్నారు.

బదిలీ ఉపాధ్యాయులను రిలీవ్ చేయాలి

రెబ్బెన: బదిలీ అయిన ఉపాధ్యాయులను వెంటనే రిలీవ్ చేయాలని పీఆర్టీయూ మండల అధ్యక్షుడు అనిల్‌కుమార్, ప్రధాన కార్యదర్శి సదానందం అన్నారు. మండలంలోని నవేగాం జెడ్పీహెచ్‌ఎస్‌తో పాటు ఎంపీపీఎస్‌లో గురువారం పీఆర్టీయూ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతనెలలో బదిలీల ప్రక్రియ చేపట్టినప్పటికి ఉపాధ్యాయులను రిలీవ్ చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. బదిలీ అయిన ఉపాధ్యాయుల స్థానంలో వీవీలను నియమించాలన్నారు. రాష్ట్ర అసోషియేట్ అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రవీణ్, కార్యదర్శి వెంకటేశ్, గురుపాదం, ప్రవీణ్, విజయ్, రవి, రజిత, రోజారమణి తదితరులు పాల్గొన్నారు

ఆర్‌ఎంపీల ఆధ్వర్యంలో క్షీరాభిషేకం



సిర్పూర్(టి): క్షీరాభిషేకం చేస్తున్న సభ్యులు

ఆసిఫాబాద్/సిర్పూర్(టి): ఆర్‌ఎంపీ, పీఎంపీ వైద్యులకు శిక్షణ ఇచ్చి సర్టిఫికెట్ ఇస్తామని సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించడంపై హర్షం వ్యక్తమవుతోంది. జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌక్ వద్ద, సిర్పూర్(టి) బస్టాండ్ ప్రాంతంలో గురువారం సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. డీసీసీ అధ్యక్షుడు విశ్వప్రసాదరావు, సంఘం అధ్యక్షుడు డాక్టర్ రూప్‌నర్ రమేశ్, ఆర్‌ఎంపి వైద్యులు శ్రీనివాస్, దాస్, ప్రవీణ్, అశోక్, దిలీప్, కేదారిగౌడ్, మధుకర్, శ్రీనివాస్‌చారి తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం



ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ దండే విఠల్

బెజ్జూర్: మండల కేంద్రంలోని ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఎమ్మెల్సీ దండే విఠల్ గురువారం సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. సీడీపీ నిధులు రూ.5లక్షలతో సీసీ రోడ్డు నిర్మిస్తున్నట్లు తెలిపారు. సిర్పూర్ నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు, టీపీసీసీ మెంబర్ అర్షద్ హుస్సేన్, మాజీ కౌన్సిలర్ షబ్బీర్, మాజీ సర్పంచ్ అన్సార్ హుస్సేన్, మాజీ ఎంపీటీసీ ఆత్రం సాయి, కాంగ్రెస్ నాయకులు రంగు సురేష్ గౌడ్, ఎల్కారి రమేశ్, ఉమా మహేశ్, సెగ్యం సకారాం, తేలి రాజేశ్, తుమ్మిడే అశోక్ పాల్గొన్నారు. దండే విఠల్ ముఖ్య అనుచరుడు సామల రాజన్న మాతృమూర్తి లక్ష్మి ఇటీవల మృతిచెందారు. ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. అంతకు ముందు మండల కేంద్రంలోని రైతు వేదికలో నిర్వహించిన రుణమాఫీ సంబురాల్లో పాల్గొన్నారు.

ఆహ్లాదం పంచేలా..



కెరమెరి: మండలంలోని సావర్‌ఖెడా గ్రామానికి వెళ్లేదారిలో పచ్చని చెట్లు ఆహ్లాదాన్ని ఇస్తున్నాయి. గత ఆరేళ్లక్రితం నాటిన మొక్కలు నేడు వృక్షాలై వచ్చేపోయే ప్రయాణికులకు నీడనిస్తున్నాయి. చూపరులను ఆకట్టుకుంటుంది. ఉదయం, సాయంత్రం గ్రామప్రజలు ఆ రోడ్డు గుండా నడుస్తున్నారు.

బీటీ ఉన్నా బస్సు లేదే!

- గ్రామాల్లో రాని ఆర్టీసీ సేవలు
- ప్రైవేటు వాహనాలు ఆశ్రయిస్తున్న ప్రజలు
- పరిమితికి మించి ఆటోల్లో ప్రయాణం
- అధిక చార్జీలతో నష్టం



తుంగెడ, మాద్వాయిగూడ గ్రామాలకు వెళ్లే బీటీ రోడ్డు

రెబ్బెన: మారుమూల గ్రామాల ప్రజలకు ఆర్టీసీ బస్సు సేవలు అందడం లేదు. రోడ్డు సౌకర్యం ఉన్నప్పటికీ యాజమాన్యం పల్లెలకు బస్సు సేవలు కల్పించడంలో నిర్లక్ష్యాన్ని వీడటం లేదు. గ్రామీణ ప్రాంతాల ప్రజలు, విద్యార్థులు ప్రైవేటు వాహనాలను ఆశ్రయిస్తున్నారు. వారి అవసరాలను ఆసరాగా చేసుకుంటున్న యజమానులు అధిక చార్జీలు వసూళ్లు చేస్తున్నారు. పరిమితికి మించి ప్రయాణికులను వాహనాల్లో ఎక్కించి తరలిస్తున్నారు.

బీటీ రోడ్డున్నా..

రెబ్బెన మండలంలోని అనేక గ్రామాలకు నేటికి ఆర్టీసీ సేవలు అందడం లేదు. మారుమూల గ్రామాల ప్రజలకు బస్సు సేవలను దూరం చేస్తున్నారు. గంగాపూర్ మీదుగా, తుంగెడ, మాద్వాయిగూడ వరకు సుమారు 9 కి.మీల బీటీ రోడ్డు ఉంది. అయినా బస్సు సేవలను ప్రారంభించటంలో ఆర్టీసీ అధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నారు. ఈ దారిలో 5 పంచాయతీలు ఉండగా వాటి పరిధిలో 9 గ్రామాలు ఉన్నాయి. తక్కళ్లపల్లి, రోళ్లపాడు పంచాయతీల్లో బీటీ రోడ్డు ఉండగా నేటి వరకు బస్సు సౌకర్యం కల్పించలేదు. ఆయా గ్రామాల ప్రజలు ప్రైవేటు ఆటోలను ఆశ్రయించాల్సి వస్తోంది. పరిమితికి మించి ప్రయాణికులకు ఎక్కిస్తుండటంతో ప్రమాదకరంగా ప్రయాణాలు సాగిస్తున్నారు.

నిలిపివేసిన బస్సు సేవలు

మండల కేంద్రం నుంచి మాద్వాయిగూడ వరకు ఆర్టీసీ యాజమాన్యం బస్సు సేవలను అందించింది. గ్రామాల్లో ఇరుకు రోడ్లు, ఇతర సాకులు చూపుతూ వీటి సేవలను నిలిపివేసింది. బస్సు సేవలను తిరిగి కల్పించాలని కోరుతూ ప్రజాప్రతినిధులు, అధికారులకు గ్రామస్తులు మొరపెట్టుకున్నారు. ఇరుకు రోడ్లలో మూలమలుపుల వద్ద సులువుగా తిరిగేలా పెద్ద బస్సు స్థానంలో మినీ బస్సును ఏర్పాటు చేసి పునరుద్ధరించగా, కొన్ని నెలలు ఈ సేవలు సాగాయి. ఆ తర్వాత మినీ బస్సుసేవలను నిలిపివేసి ఆసిఫాబాద్ టూ మంచిర్యాల వరకు నాన్‌స్టాప్ సర్వీసు కోసం కేటాయించారు. దాంతో తుంగెడ, మాద్వాయిగూడ గ్రామాలకు కరోనాకు ముందు బస్సు సర్వీసులు నిలిచిపోగా ఇప్పటి వరకు మళ్లీ ప్రారంభం కాలేదు. ఆ రూటులో 9 గ్రామాల ప్రజలు, విద్యార్థులు రెబ్బెనకు రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులకు గురవుతున్నారు. గత్యంతరం లేక ఆటోల్లో వెళ్తే యజమానులు అధిక చార్జీలను వసూళ్లతో ఆర్థికంగా నష్టపోతున్నారు.

బస్సు సేవలు పునరుద్ధరించాలి



రెబ్బెన నుంచి తుంగెడ మీదుగా గతంలో నడిచిన ఆర్టీసీ బస్సు సేవలను మళ్లీ పునరుద్ధరించాలి. రోడ్డు సౌకర్యం ఉన్న చోట సేవలందక రెబ్బెనకు ఆటోల్లో వెళ్లాల్సి వస్తోంది. అందుబాటులో బస్సు సేవలు ఉంటే ఎంతో ఉపయోగకరం.

– ఎల్పుల వెంకటేశ్, తుంగెడ

మినీ బస్సులు ఏర్పాటు చేయాలి



రెబ్బెన నుంచి మాద్వాయిగూడ వెళ్లాలంటే ఆటోల్లో వెళ్లాల్సి వస్తోంది. గతంలో గ్రామంలో రోడ్డు ఇరుకుగా ఉండగా దాన్నే సాకుగా చూపి బస్సు సేవలనే నిలిపివేశారు. మినీ బస్సులు ఏర్పాటు చేస్తే ఇబ్బందులు ఉండవు.

– పూదరి శంకరయ్య, తుంగెడ

చొరవ చూపాలి



మాద్వాయిగూడ నుంచి విద్యార్థులు ప్రతీరోజు తుంగెడ జెడ్పీ పాఠశాలకు వస్తారు. అందుబాటులో బస్సు సేవలు లేక ఆటోల్లో వెళ్తున్నారు. మారుమూల గ్రామాలకు ఆర్టీసీ బస్సు సేవలందేలా ప్రజాప్రతినిధులు, అధికారులు చొరవ చూపాలి.

– మాదాసు ప్రమోద్, తుంగెడ

చట్టాలపై అవగాహన

జైనూర్: విద్యార్థులు నూతన చట్టాలు, రోడ్డు ప్రమాదాలు, ట్రాఫిక్ నియమాలపై అవగాహన ఉండాలని ఏఎస్సై ఉమేష్ అన్నారు. మండలంలోని భూసిమెట్ట గురుకుల పాఠశాల విద్యార్థులకు గురువారం పలు అంశాలపై కళాజాత బృందంతో అవగాహన కల్పించారు. సైబర్ నేరాలు పెరుగుతున్నాయన్నారు. సైబర్ నేరగాళ్ల మాయమాటలు నమ్మి మోసపోవద్దన్నారు. ఎవరైన సైబర్ మోసాలకు గురైతే 1930నెంబర్ కి ఫిర్యాదు చేయాలన్నారు. పోలీసు సిబ్బంది, ఉపాధ్యాయులు ఉన్నారు.

మాట్లాడుతూనే.. మృత్యుఒడిలోకి..



శంకర్ (ఫైల్)

కౌటాల: ఫోన్‌లో మాట్లాడుతుండగా ఒక్కసారిగా కుప్పకూలి రైతు మృతి చెందిన ఘటన మండలంలో చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు.. గురుడుపేట గ్రామానికి చెందిన లంబడి శంకర్(60) గురువారం ఉదయం తనకు ఛాతీలో నొప్పిగా ఉందని, ఆస్పత్రికి వెళ్లేందుకు రావాలని బంధువు నారాయణకు ఫోన్ చేసి మాట్లాడుతుండగా ఒక్కసారిగా కుప్పకూలాడు. కుటుంబీకులు ఇచ్చిన సమాచారంతో ఆర్‌ఎంపీ అతనికి సీపీఆర్ చేశారు. తర్వాత ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా.. అప్పటికే గుండెపోటుతో మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. వ్యవసాయ పనులకు వెళ్లేందుకు సిద్ధమైన శంకర్ హఠాన్మరణంతో గ్రామంలో విషాదచాయలు అలుముకున్నాయి. అనంతరం అంత్యక్రియలు నిర్వహించా రు. మృతుడికి భార్య భీమబాయి, ఇద్దరు కుమారులు, ముగ్గురు కుమార్తెలున్నారు.